teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక


ములుగు | సంపుటి : 04 | సంచిక : 27 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | మంగళవారం | 1 జులై 2025 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.

## జూన్ 30 నుంచి సింహవాహిని మహంకాళి ఉత్సవాలు

### తెలంగాణ ప్రభుత్వ సహకారంతో ఢిల్లీలో ఘనంగా నిర్వహణ

తెలంగాణ బ్యూరో, జూన్ 30 (తీన్మార్ న్యూస్): సింహ వాహిని మహంకాళి అమ్మవారి ఉత్సవాలు జూన్ 30 నుంచి జూలై 2వ తేదీ వరకు తెలంగాణ ప్రభుత్వ సహకారంతో ఢిల్లీలో ఘనంగా నిర్వహిస్తున్నారు. జూన్ 30వ తేదీన తెలంగాణ భవన్‌లో ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. జూలై 1వ తేదీన ఇండియా గేట్ నుంచి తెలంగాణ భవన్ వరకు మహంకాళి అమ్మవారి ఊరేగింపు ఉంటుంది. గత పదేళ్ల నుంచి ఢిల్లీలో తెలంగాణ భవన్‌లో సింహవాహిని మహంకాళి అమ్మవారి బోనాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఢిల్లీలో ఉన్న తెలుగు వారంతా పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొనాలని ప్రభుత్వం ఆహ్వానం పలికింది. లాల్ దర్వాజా బోనాలు ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో పలువురు ప్రముఖులు హాజరు కానున్నారని సింహవాహిని శ్రీమహంకాళి దేవాలయ ఉత్సవ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.





## ఘోర అగ్నిప్రమాదంపై స్పందించిన కేసీఆర్

మరణించిన కార్మికుల మృతిపై దిగ్భ్రాంతి వ్యక్తం

ఎర్రవల్లి ఫామ్ హౌస్ నుంచి ఓ పత్రికా ప్రకటన విడుదల

.. వివరాలు 2లో



## దూరవిద్యలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధికారిక ప్రకటన

.. వివరాలు 2లో



# సీగాచి ఫార్మాలో భారీ పేలుడు

### రియాక్టర్ పేలడంతో చెలరేగిన భారీ ఎత్తున మంటలు

- 12 మంది దుర్మరణం.. 30 మందికి పైగా గాయాలు
- పలువురి పరిస్థితి విషమం.. ఆసుపత్రికి తరలింపు
- సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి
- బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ
- కేంద్ర, రాష్ట్ర మంత్రుల పరామర్శ
- ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశం
- భద్రతా లోపాలపై అనుమానాలు ఈ ఘటనతో పతన దిశలో కంపెనీ షేర్లు



తెలంగాణ బ్యూరో, జూన్ 30 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలోని సంగారెడ్డి జిల్లా, పటాన్ చెరువు సమీపంలోని పాశమైలారం పారిశ్రామికవాడలో ఉన్న సీగాచి ఫార్మా (సిగాచి కెమికల్స్) కంపెనీలో సోమవారం ఉదయం సుమారు 9 గంటల సమయంలో ఘోర ప్రమాదం సంభవించింది. ఒక రియాక్టర్ ఒక్కసారిగా పేలడంతో భారీ ఎత్తున మంటలు చెలరేగి, కంపెనీ ప్రాంగణమంతా వ్యాపించాయి. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు సుమారు 12 మంది

మిగతా 2 లో

## పేద ఖైదీల బెయిల్ మంజూరుకు ముందుకొచ్చిన కేంద్రం

బెయిల్ కు ఆర్థిక సహాయం చేసేందుకు ప్రణాళిక సిద్ధం

ఈ మేరకు అన్ని రాష్ట్రాలకు లేఖ రాసిన కేంద్ర హోంశాఖ



న్యూ ఢిల్లీ, జూన్ 30 (తీన్మార్ న్యూస్): పేద ఖైదీల బెయిల్ మంజూరుకు సాయం చేసేందుకు కేంద్రం ముందుకొచ్చింది. పేద ఖైదీలు బెయిల్ పొందేందుకు అవసరమైన ఆర్థిక సహాయం చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాల హోంశాఖ ముఖ్య కార్యదర్శులకు, జైళ్లశాఖ డీజీలకు ఇటీవల కేంద్ర హోంశాఖ లేఖ రాసింది. ఈ స్కీమ్ కింద అర్హులైన వారి జాబితా రూపొందిస్తే వాళ్లు చెల్లించాల్సిన

మిగతా 2 లో

## హైకోర్టులో గ్రూప్ 1 పిటిషన్లపై విచారణ

నేడు కూడా కొనసాగనున్న విచారణ






## రైలు ప్రయాణికులకు బిగ్ అలర్ట్

అర్ధరాత్రి నుంచి అమల్లోకి చార్జీలు, టికెట్ బుకింగ్లో మార్పులు

చార్జీలతో పాటు, తత్కాల్ బుకింగ్లో ఆధార్ తప్పనిసరి

న్యూ ఢిల్లీ, జూన్ 30 (తీన్మార్ న్యూస్): ప్రయాణికులకు బిగ్ అలర్ట్. సోమవారం (మంగళవారం) అర్ధరాత్రి 12 గంటల నుంచి అమల్లోకి రైల్వే చార్జీలు టికెట్ బుకింగ్ లో మార్పులు అమల్లోకి రాబోతున్నాయి. కొత్త చార్జీలతో పాటు, తత్కాల్ టికెట్

మిగతా 2 లో




## కాళేశ్వరం కమిషన్‌కు కేబినెట్ మినిట్స్

సమర్పించిన రాష్ట్ర సర్కార్

నివేదికలో కీలక అంశాలను ప్రస్తావించినట్టు సమాచారం

## రాష్ట్ర అధ్యక్షుడి ప్రకటన వేళ తెలంగాణ బీజేపీలో కలకలం



అనూహ్యంగా గోషామాల్ ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామా

ఈ మేరకు కిషన్ రెడ్డికి చేరిన రాజీనామా లేఖ

తాజాగా స్పందించిన రాష్ట్ర పార్టీ అధిష్టానం

హైదరాబాద్, జూన్ 30 (తీన్మార్ న్యూస్): బీజేపీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి ప్రకటన వేళ తెలంగాణ బీజేపీలో కలకలం రేగింది. అనూహ్యంగా ఆ పార్టీ కీలక నేత, గోషామాల్ ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను కిషన్ రెడ్డికి పంపించారు. అయితే రాజాసింగ్ వ్యవహారంపై తాజాగా రాష్ట్ర పార్టీ అధిష్టానం స్పందించింది. రాజాసింగ్ చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని కొట్టిపారేసింది. రాజాసింగ్ క్రమశిక్షణా రాహిత్యం పరాకాష్టకు చేరిందని మండిపడింది. రాజాసింగ్

మిగతా 2 లో

## 5 గ్రామాలను తెలంగాణలో విలీనం చేయాలి




కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన రాష్ట్ర ప్రభుత్వం

ఐదు గ్రామాలు తెలంగాణ జాగృతి సాధించిన విజయం

ఎక్స్ వేదికగా ఎమ్మెల్సీ కవిత ట్వీట్




## హైదరాబాద్ మెట్రోకు ప్రత్యేక గుర్తింపు పురస్కారం

యూఐటీపీ అవార్డుల 2025 దక్కించుకున్న ఎల్అండ్‌టీ

## ఆర్టీసీలో అధునాతన సంస్కరణలు

డిజిటల్ పేమెంట్స్ ద్వారా బస్సులో ప్రయాణం

ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నాం

రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్, జూన్ 30 (తీన్మార్ న్యూస్): ముషీరాబాద్ ఆర్టీసీ డిపోను మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. అధునాతన టెక్నాలజీ ద్వారా ఆర్టీసీ అమలు చేస్తున్న డిజిటల్ పేమెంట్స్ అమలును పరిశీలించారు. డిజిటల్ పేమెంట్స్, ప్రయాణికుల వివరాలు, హెడ్ ఆఫీస్ కనెక్టివిటీ తదితర సాంకేతికత గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఎండీ సజ్జనార్, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్

మిగతా 2 లో

# జిల్లాలో నిత్యం చర్చనీయాంశంగా సర్వే నెం.33

**కలెక్టరేట్‌లో సర్వే నెం. 33 భూముల సమస్యపై ఫిర్యాదు**
**గ్రామంలోని నిజమైన రైతులకు న్యాయం చేయాలి: గ్రామస్తులు**
**తక్షణమే విచారణకు కలెక్టర్ హామీ**


జయశంకర్ భూపాలపల్లి, జూన్ 30 (తీన్మార్ న్యూస్): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ సెల్ లో గోరుకొత్తపల్లి మండలం కొనరావుపేట గ్రామపంచాయతీ శివారులోని సర్వే నెంబర్ 33 భూములకు సంబంధించిన సమస్యపై కొనరావుపేట గ్రామస్తులు జిల్లా కలెక్టర్ కి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ 33 సర్వే నెంబర్ భూములకు సంబంధించిన వివాదం గతంలో కూడా కలెక్టర్ దృష్టికి తీసుకురావడం జరిగిందని, అయితే ఇప్పటివరకు సమస్య పరిష్కారంలో జాప్యం జరిగిందని గ్రామస్తులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. సర్వే నెంబర్ 33లో బైనెంబర్లు సృష్టించిన అధికారులు, వారికి సహకరించిన దళారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ఆదాయాన్ని అక్రమంగా సొమ్ము చేసుకున్న దళారులపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కలెక్టర్ ని కోరారు. అలాగే, తమ గ్రామంలోని నిజమైన రైతులకు న్యాయం చేయాలని, బైనెంబర్లు సృష్టించి రైతు భరోసా, బ్యాంకు రుణాలు పొందుతున్న వారిపై తక్షణమే చర్యలు తీసుకొని, వారికి మంజూరైన రైతు భరోసా, బ్యాంకు రుణాలను నిలిపివేయాలని గ్రామస్తులు విన్నవించుకున్నారు. ఈ విషయమై భూపాలపల్లి జిల్లా కలెక్టర్ తక్షణమే విచారణ జరిపి, గ్రామస్తులకు తగిన న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలియజేశారు.

**జిల్లాలో నిత్యం చర్చనీయాంశంగా సర్వే నెం.33**

**రైతులకు న్యాయం జరుగుతుందని ఆశిద్దాం**

కొనరావుపేట సర్వే నెంబర్ 33 భూముల వివాదం జిల్లాలో నిత్యం చర్చనీయాంశంగా మారింది. గతంలోనూ ఈ సర్వే నెంబర్‌లో తక్కువ ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా, ప్రస్తుతం అది ఎక్కువ ఎకరాలకు (ఉన్న భూమి ఉన్నట్టే ఉన్నా రికార్డుల్లో మాత్రం భూమి విస్తీర్ణం పెంపు) పట్టాలు నమోదైనట్లు, దాని ఆధారంగా రైతు భరోసా, పీఎం కిసాన్, బ్యాంకుల్లో క్రాప్ లోన్లు పొందుతున్నారని ఆరోపణలున్నాయి. కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్న నిజమైన రైతులతో అక్రమ పట్టాదారులు గొడవ పడ్డ సందర్భాలు కూడా ఉన్నాయి. ఒక అధికారి తన కుటుంబ సభ్యులకు కూడా అక్రమంగా పట్టా చేయించినట్లు గత వార్తలు స్పష్టం చేస్తున్నాయి. రెవెన్యూ వ్యవస్థలో పారదర్శకత, కచ్చితత్వం లోపాలను ఈ వివాదం మరోసారి ఎత్తిచూపుతోంది. ఆన్‌లైన్ రెవెన్యూ రికార్డులు, వాస్తవ భూవిస్తీర్ణం మధ్య వ్యత్యాసం, అసైన్డ్ భూముల జారీలో అస్పష్టత వంటి సమస్యల పరిష్కారం కోసం అధికారులు వేగంగా స్పందించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత కలెక్టర్ హామీతోనైనా ఈ దీర్ఘకాలిక సమస్యకు తగిన పరిష్కారం లభించి, నిజమైన రైతులకు న్యాయం జరుగుతుందని ఆశిద్దాం.







## 5 గ్రామాలను తెలంగాణలో విలీనం చేయాలి

హైదరాబాద్, జూన్ 30 (తీన్మార్ న్యూస్): గత కొద్ది రోజులుగా తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో రాష్ట్ర విభజన సమయంలో ఏపీలో కలిపిన ఐదు గ్రామాలను తెలంగాణలో కలపాలని పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో భద్రాచలం పట్టణంలో అంతర్భాగంగా, పట్టణాన్ని ఆనుకొని ఉన్న 5 గ్రామాలను తెలంగాణలో విలీనం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ నిర్ణయం ఆ ఐదు గ్రామాల ప్రజలు, తెలంగాణ జాగృతి సాధించిన విజయం అంటూ ఎమ్మెల్సీ కవిత తన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ఆమె తన ట్వీట్‌లో ఇలా రాసుకొచ్చారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సమయంలోనే ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాలను ఏపీలో విలీనం చేస్తూ చీకటి ఆర్డినెన్స్ ఇచ్చిందని, ఈ ఆర్డినెన్స్ తో భద్రాచలం పట్టణానికి పక్కనే ఉన్న ఎటపాక, కన్నాయిగూడెం, పిచ్చుకల పాడు, పురుషోత్తమ పట్టణం, గుండాల గ్రామాలు ఏపీలో విలీనం అయ్యాయని గుర్తు చేశారు. కేంద్రం నిర్ణయం వల్ల భద్రాచల శ్రీ సీతారాముల భూములు ఏపీలోకి వెళ్లిపోయాయని, ఐదు గ్రామాల ప్రజలు విద్య, వైద్యం సహా ఇతర అవసరాల కోసం నిత్య నరకం అనుభవిస్తున్నారని అన్నారు. ఆ ఐదు గ్రామాల గోడపై తెలంగాణ జాగృతి ఈనెల 20న 'పోలవరం - తెలంగాణ పై జలఖడ్గం' పేరుతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తెలంగాణ జాగృతి డిమాండ్‌కు దిగివచ్చి రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా కి లేఖ ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు. అలాగే ఐదు గ్రామాలను తిరిగి తెలంగాణలో విలీనం చేసే వరకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నట్లు కవిత తన ట్వీట్‌లో రాసుకొచ్చారు.

## రాష్ట్ర అధ్యక్షుడి ప్రకటన వేళ తెలంగాణ "బీజేపీ" లో కలకలం



మొదటి పేజీ తరువాయి

ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలనుకుంటే స్పీకర్‌కు లేఖ ఇవ్వాలని హితవు పలికింది. బీజేపీ నాయకులు, వ్యక్తుల కంటే కార్యకర్తలకు ప్రాధాన్యత ఇస్తుందని గుర్తుచేసింది. రాష్ట్ర పార్టీ అధ్యక్షులకు ఇచ్చిన రాజీనామా లేఖను జాతీయ అధ్యక్షుడికి పంపిస్తున్నామని బీజేపీ పేర్కొంది. ఇదిలా ఉంటే రాష్ట్ర అధ్యక్షుడిగా ఒక వ్యక్తిని అధిష్టానం నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతోందని, సరైన వ్యక్తికి బాధ్యతలు ఇవ్వకపోతే పార్టీ చాలా నష్టం జరుగుతుందని అన్నారు. నావాడు, నీవాడు అంటూ నియమించుకుంటూ పోకూడదని హితవు పలికారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలంటే ఎన్నిక నిర్వహించాలని డిమాండ్ చేశారు.

## కాళేశ్వరం కమిషన్‌కు కేబినెట్ మినిట్స్

హైదరాబాద్, జూన్ 30 (తీన్మార్ న్యూస్): కాళేశ్వరం ప్రాజెక్టు సంబంధిత అవకతవకలపై జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ నేతృత్వంలోని కమిషన్‌కు సోమవారం తెలంగాణ ప్రభుత్వం కేబినెట్ మినిట్స్ సమర్పించింది. ఈ నివేదికలో ప్రభుత్వం పలు కీలక అంశాలను ప్రస్తావించినట్టు తెలుస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, ముఖ్యంగా మేడిగడ్డ బ్యారేజ్, కేవలం పరిపాలన అనుమతి (అడ్మినిస్ట్రేటివ్ అప్రూవల్) ఆధారంగానే జరిగిందని, దీనిపై 2016-2017 కాలంలో కేబినెట్‌లో ఎలాంటి సవివరమైన చర్చ జరగలేదని నివేదిక స్పష్టం చేసింది. 2016 మార్చి 1న మేడిగడ్డ బ్యారేజ్ నిర్మాణానికి పరిపాలన అనుమతి ఇవ్వగా, పనులు ప్రారంభమయ్యే సమయానికి వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక కూడా సిద్ధం కాలేదని తెలిపింది. అనుమతి ఇచ్చిన ఏడాది తర్వాత, 2017లోనే మంత్రివర్గ సమావేశంలో ఈ ప్రాజెక్టుపై తొలిసారి చర్చ జరిగినట్లు నివేదిక పేర్కొంది. ప్రాజెక్టు రీడిజైన్‌లో భాగంగా, గతంలో ప్రాణహిత -చేవెళ్ల పథకం కింద తమ్మిడిహెట్టి వద్ద ప్రతిపాదిత బ్యారేజీని మేడిగడ్డకు మార్చడం, మూడు బ్యారేజీలు (మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల), 19 పంప్ హౌస్‌లు, 20 రిజర్వాయర్లతో నిర్మాణం కొనసాగిందని తెలిపింది. కాళేశ్వరం ప్రాజెక్ట్ పై కాగ్ ఇచ్చిన నివేదికలో ప్రాజెక్టు వ్యయం రూ.1.47 లక్షల కోట్లకు పైగా ఉంటుందని తెలిపింది. నిర్మాణ లోపాల వల్ల మేడిగడ్డ బ్యారేజ్ పిల్లర్లు 2023 అక్టోబర్ 22న కుంగిపోయాయని, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు కూడా నీటి నిల్వకు పనికిరావని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ తేల్చినట్లు నివేదికలో ఉంది. జస్టిస్ ఘోష్ కమిషన్, నీటిపారుదల శాఖ మాజీ ఇంజనీర్లు, ఐఏఎస్ అధికారులు, పలువురు బీఆర్ఎస్ నేతల నుండి అఫిడవిట్లు సేకరించి, డిజైన్, నాణ్యత, ఆర్థిక అంశాలపై విచారణ జరుపుతోంది.

## సీగాచి ఫార్మాలో భారీ పేలుడు

మొదటి పేజీ తరువాయి

కార్మికులు మరణించినట్లు సమాచారం, కాగా 10 మంది మరణించినట్లు అధికారికంగా ధృవీకరించారు. అయితే, ప్రత్యక్ష సాక్షులు మరియు కొన్ని మీడియా నివేదికల ప్రకారం మృతుల సంఖ్య 13 నుండి 15 వరకు ఉండవచ్చని, మృతదేహాలు ఛిద్రమవ్వడంతో డీఎన్ఏ పరీక్షలు అవసరమయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.

**ప్రమాద వివరాలు:**

సమయం: ఉదయం 9 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. కార్మికులు తమ రోజువారీ పనుల్లో నిమగ్నమై ఉండగా ఈ దుర్ఘటన చోటు చేసుకుంది.

ప్రమాద కారణం: ప్రాథమిక నివేదికల ప్రకారం, ఒక రియాక్టర్ పేలడం వల్ల ఈ ప్రమాదం సంభవించింది. పేలుడు ధాటికి కంపెనీ షెడ్డు పూర్తిగా కూలిపోవడమే కాకుండా, అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్, మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ సహా చాలా భాగాలు దెబ్బతిన్నాయి. అయితే, కొన్ని తాజా నివేదికల ప్రకారం, రియాక్టర్ పేలలేదని, అధిక వేడి గాలి ఒత్తిడి వల్లే ఈ భారీ పేలుడు సంభవించిందని అధికారులు నిర్ధారించారు. రియాక్టర్లు భద్రంగానే ఉన్నాయని పేర్కొన్నారు.

మృతులు, క్షతగాత్రులు: ప్రమాదం జరిగినప్పుడు కంపెనీలో సుమారు 66 నుండి 100 మంది కార్మికులు ఉన్నట్లు సమాచారం. పేలుడు ధాటికి రియాక్టర్ వద్ద పనిచేస్తున్న కార్మికులు దాదాపు 100 మీటర్ల దూరం ఎగిరిపడ్డారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ ఘటనలో 10 మంది మరణించగా, 30 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో 16 మందిని మదీనాగూడలోని ప్రణం ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పలువురి పరిస్థితి విషమంగా ఉందని తెలుస్తోంది. మరణించిన వారిలో ఐదుగురు సంఘటనా స్థలంలోనే మృతి చెందగా, మిగిలిన ఐదుగురు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. మృతుల్లో ఒడిశా రాష్ట్రానికి చెందిన కార్మికులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది.

సహాయక చర్యలు: ప్రమాద సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలను అదుపు చేయడానికి 2 నుండి 11 అగ్నిమాపక యంత్రాలు శ్రమిస్తున్నాయి. గాయపడిన వారిని ఆసుపత్రులకు తరలించడానికి భారీగా అంబులెన్సులు, 108 సిబ్బంది చేరుకున్నారు. శిథిలాలను తొలగించి, చిక్కుకుపోయిన కార్మికులను వెలికి తీసే పనులు కొనసాగుతున్నాయి.

**ప్రభుత్వ స్పందన:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి: ఈ ఘోర ప్రమాదంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన తన ఎక్స్ వేదికగా స్పందిస్తూ, "పాశమైలారం పారిశ్రామిక వాడ అగ్ని ప్రమాద ఘటనలో కార్మికులు మరణించడం దిగ్భ్రాంతి కలిగించింది. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సహాయం అందించాలని అధికారులను ఆదేశించాను. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుంది" అని పేర్కొన్నారు. సహాయక చర్యలను ముమ్మరం చేయాలని, ప్రమాదంలో చిక్కుకున్న కార్మికులను కాపాడటానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి: ఈ ప్రమాద ఘటనపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కూడా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. జిల్లా యంత్రాంగంతో మాట్లాడి తక్షణ సహాయక చర్యలు అందించాలని కోరారు. భారత ప్రభుత్వం బాధిత కుటుంబాలకు సంఘీభావంగా నిలుస్తుందని, ఆర్థిక సహాయం అందిస్తుందని తెలిపారు.

ప్రధాని మోదీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా ఈ ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా ప్రకటించారు.

రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ: రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మదీనాగూడలోని ప్రణం హాస్పిటల్‌ను సందర్శించి క్షతగాత్రులను పరామర్శించారు. మృతుల సంఖ్య 13కు చేరిందని, 12 మంది పరిస్థితి విషమంగా ఉందని వెల్లడించారు. ప్రమాదం జరిగినప్పుడు పరిశ్రమలో 90 మంది ఉన్నారని, 22 మంది కార్మికులు కాలిన గాయాలతో చికిత్స పొందుతున్నారని తెలిపారు.

ఇతర పరిణామాలు:

షేర్ల పతనం: ఈ ప్రమాద వార్తతో సీగాచి ఇండస్ట్రీస్ షేర్లు సోమవారం ఒక్కరోజే దాదాపు 14 శాతం కుప్పకూలాయి.


భద్రతా లోపాలు: ఈ ప్రమాదం కంపెనీలో భద్రతా చర్యల లోపాలను వెలుగులోకి తెచ్చిందని పలువురు ఆరోపిస్తున్నారు. భద్రతా నిబంధనలను పాటించకపోవడం వల్లే ఈ ఘటన జరిగిందని అంటున్నారు.

ఈ ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశించారు. ఈ దుర్ఘటన తెలంగాణ పారిశ్రామిక భద్రతపై ఆందోళనలను రేకెత్తించింది.

## ఆర్టీసీలో అధునాతన సంస్కరణలు

మొదటి పేజీ తరువాయి

మాట్లాడుతూ తెలంగాణ ప్రజల సౌకర్యార్థం ఆర్టీసీలో అధునాతన సంస్కరణలు తీసుకొస్తున్నామని అన్నారు. పెరుగుతున్న సాంకేతిక ఉపయోగించుకొని డిజిటల్ పేమెంట్స్ ద్వారా బస్సులో ప్రయాణం చేసేవారు టికెట్ లావాదేవీలు జరుపుకునే విధంగా కొత్త కార్యక్రమం తీసుకున్నామని తెలిపారు. ఇప్పటికే హైదరాబాద్‌లో గత 3 నెలలుగా 16 -20 శాతం డిజిటల్ పేమెంట్స్ పూర్తి చేయడం జరిగిందని చెప్పారు. తెలంగాణ వ్యాప్తంగా ఆరు వేల బస్సుల్లో డిజిటల్ పేమెంట్ పూర్తయ్యాయని అన్నారు. దాని డేటా హెడ్ ఆఫీస్‌లో వెంట వెంటనే అప్డేట్ అవుతుంది. ఆ బస్సులో ఎంతమంది ఉన్నారు. ఆదాయం ఎంత వస్తుంది అనే విషయం హెడ్ ఆఫీస్‌లో డేటా వస్తుందని అన్నారు. ఢిల్లీ మాదిరి ఇక్కడ కాలుష్యం ఉండకుండా తెలంగాణలో ఈవీ పాలసీ తీసుకొచ్చాం. దేశంలో ఎక్కడా లేని విధంగా ఈవీ వాహనాలు అమ్మకం జరుగుతోంది. చాలా కాలం తర్వాత ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఈవీ, CNG, LPG ఆటోలకు పర్మిషన్లు ఇచ్చాం. అంతేగాకుండా ఆర్టీసీ సేవలు కొత్త కాలనీలకు విస్తరిస్తున్నాం. హైదరాబాద్‌లో కొత్త కాలనీలకు ఓఆర్ఆర్ లోపల బస్సు రూట్లో ఏర్పాటు చేసి ప్రయాణికుల సౌకర్యాలు పెంచేలా చేస్తున్నామని కీలక ప్రకటన చేశారు.




## పేద ఖైదీల బెయిల్ మంజూరుకు ముందుకొచ్చిన కేంద్రం

మొదటి పేజీ తరువాయి

జరిమానాను కేంద్రమే చెల్లిస్తుంది. రిమాండ్‌తో పాటు శిక్షపడిన ఖైదీలకు సైతం ఈ స్కీమ్ వర్తిస్తుంది. దీనికి సంబంధించి కేంద్ర హోంశాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. దీనిప్రకారం జిల్లా, రాష్ట్రస్థాయిలో కమిటీలు నియమించాలి. రిమాండ్ ఖైదీలైనా, శిక్షపడిన వారైనా బెయిల్ వచ్చాక కూడా 7 రోజుల తర్వాత విడుదల కాకపోతే వాళ్ల లిస్ట్‌ను రూపొందిస్తారు.

ఇందులో జరిమానా చెల్లించలేని వారిని గుర్తిస్తారు. రిమాండ్ ఖైదీల జరిమానా మొత్తం రూ.40 వేల లోపు ఉన్నట్లయితే అంత మొత్తం రిలీజ్ చేయాలని ఈ స్కీమ్‌కు సెంట్రల్ నోడల్ ఏజెన్సీగా ఉన్న జాతీయ నేరాల నమోదు సంస్థని జిల్లా కమిటీ అభ్యర్థిస్తుంది. దీంతో సీఎన్ఏ అంత మొత్తం విడుదల చేస్తుంది. ఒకవేళ జరిమానా రూ.40 వేలకు మించి ఉంటే ఆ విషయాన్ని జిల్లా కమిటీ రాష్ట్ర కమిటీకి తెలియజేస్తుంది. ఈ తర్వాత రాష్ట్ర కమిటీ దీన్ని పరిశీలించి సీఎన్ఏ కు రాస్తుంది. దీంతో ఆ మొత్తాన్ని సీఎన్ఏ విడుదల చేస్తుంది. కేంద్ర హోం శాఖ ఆదేశాల మేరకు ఈ స్కీమ్ కింద అర్హులైన ఖైదీల జాబితాను రాష్ట్రాల్లో సిద్ధం చేస్తున్నారు. అయితే డ్రగ్స్, మనీ ల్యాండరింగ్, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టాల కింద అరెస్టయిన వాళ్లకి ఈ పథకం వర్తించదు.

## హైకోర్టులో గ్రూప్ 1 పిటిషన్లపై విచారణ

హైదరాబాద్, జూన్ 30 (తీన్మార్ న్యూస్): తెలంగాణ హైకోర్టులో సోమవారం గ్రూప్ 1 పిటిషన్లపై విచారణ జరిగింది. టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష సమాధాన పత్రాల మూల్యాంకనంలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్లపై సోమవారం విచారణ జరగగా ఈ విచారణ రేపు కూడా కొనసాగనుంది. పరీక్ష కేంద్రాల కేటాయింపు, హాల్ టికెట్ నంబర్ల మార్పిడి, పేపర్ వాల్యుయేషన్ ప్రక్రియలో అవకతవకలు వంటి అక్రమాలు జరిగాయని పరీక్ష రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని పిటిషన్లో కోరారు. అయితే గ్రూప్ 1 నియామక ప్రక్రియను గతంలోనే హైకోర్ట్ తాత్కాలికంగా నిలిపివేసింది. కానీ సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరుపుకోడానికి అనుమతించింది.

## ఘోర అగ్నిప్రమాదంపై స్పందించిన కేసీఆర్

హైదరాబాద్, జూన్ 30 (తీన్మార్ న్యూస్): సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని ఒక పరిశ్రమలో జరిగిన ఘోర అగ్నిప్రమాదంపై మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పందించారు. ఈ మేరకు ఆయన అగ్ని ప్రమాదంలో మరణించిన కార్మికుల మృతిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ సంతాపం తెలుపుతూ ఎర్రవల్లి ఫామ్ హౌస్ నుంచి ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. అందులో పాశమైలారం ప్రమాదంలో మృతుల సంఖ్య ఇంకా పెరగనున్నదనే వార్తల పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదానికి కారణాలపై విచారణ జరిపించాలని, అగ్ని ప్రమాదంలో గాయపడిన వారికి తక్షణమే మెరుగైన వైద్య చికిత్స అందించాలని, చనిపోయిన కార్మికులు ఉద్యోగుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని ప్రభుత్వానికి మాజీ సీఎం కేసీఆర్ సూచించారు. అలాగే మరణించిన వారి కుటుంబాలకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## దూరవిద్యలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

**అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధికారిక ప్రకటన**

హైదరాబాద్, జూన్ 30 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్‌లోని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2025-26 విద్యా సంత్సరానికి డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హత గల అభ్యర్థులు ఆగస్టు 13వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చు. డిగ్రీ (బీఏ/బీకాం/బీఎస్సీ) కోర్సులు, పీజీ (ఎంఏ/ ఎంకాం/ ఎంఎస్సీ) కోర్సులు, బీఎల్ఐఎస్సీ, ఎంఎల్ఐఎస్సీ, పీజీ డిప్లొమా, పలు సర్టిఫికెట్ కోర్సుల్లో 2025-26 విద్యా సంవత్సరం ప్రవేశానికి అడ్మిషన్ నోటిఫికేషన్ విడుదల అయినట్లు విశ్వవిద్యాలయ అధికారులు తాజాగా ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా కోర్సుల్లో చేరడానికి విద్యార్హతలు, ఫీజు, కోర్సులు తదితర వివరాలను www.braouonline.in; www.braou.ac.inలో పొందొచ్చని అధికారులు వెల్లడించారు. ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా ట్యూషన్ ఫీజును చెల్లించాలని, అంతకు ముందు చేరిన విద్యార్థులు సకాలంలో ఫీజు చెల్లించలేక పోయిన వారు కూడా ఆగస్టు 13వ తేదీ లోపు ట్యూషన్ ఫీజును ఆన్ లైన్ లో చెల్లించాలని సూచించారు. పూర్తి సమాచారం కొరకు, ఆన్ లైన్‌లో నమోదు తదితర అంశాలపై సందేహాలుంటే సమీపంలోని అధ్యయన కేంద్రంలో సంప్రదించాలని లేదా విశ్వవిద్యాలయ హెల్ప్ డెస్క్ నంబర్లు: 7382929570/580, 040-23680290/291/294/295 టోల్‌ఫ్రీ నెం.18005990101 లో సంప్రదించొచ్చని సూచించారు. డిగ్రీ, పీజీ ఓల్డ్ బ్యాచ్ విద్యార్థులు రెండో, మూడో సంవత్సరంలో ఫీజు సకాలంలో చెల్లించలేక పోయిన వారు, 2016-17 విద్యా సంవత్సరం నుంచి 2024-25 వరకు అడ్మిషన్ పొంది ఉంటే నెట్ బ్యాంకింగ్/ క్రెడిట్/డెబిట్ కార్డ్ లేదా TS/AP ఆన్ లైన్ ద్వారా ట్యూషన్ ఫీజు చెల్లించొచ్చు అని వివరించారు. ఆగస్టు 13 ట్యూషన్ ఫీజు చెల్లించడానికి చివరి తేదీ అని వెల్లడించారు.

## రైలు ప్రయాణికులకు బిగ్ అలర్ట్

మొదటి పేజీ తరువాయి

బుకింగ్ లో ఆధార్ తప్పనిసరి విధానం అమల్లోకి తీసుకుబోతున్నారు. సెకండ్ క్లాస్ ఆర్డినరీకి 0 నుంచి 500 కిలోమీటర్ల వరకు సాధారణ చార్జీలు, 501 కిలోమీటర్ల నుంచి 1500 కిలోమీటర్ల వరకు టికెట్ పై రూ.5 పెంచారు. 1501 కిలోమీటర్ల నుంచి 2500 కిలోమీటర్ల వరకు టికెట్ పై రూ. 10, 2501 కిలోమీటర్ల నుంచి 3 వేల కిలోమీటర్ల వరకు టికెట్ పై రూ. 15 పెంచారు. ఆర్డినరీ స్లీపర్ క్లాస్, ఫస్ట్ క్లాస్ ఆర్డినరీ టికెట్లపై కిలోమీటర్ కు అర పైసా, మెయిల్ లేదా ఎక్స్ ప్రెస్ రైళ్లలో నాన్ ఏసీ టికెట్లపై కిలోమీటర్ కు ఒక పైసా పెంచారు. నాన్ ఏసీ ఫస్ట్, సెకండ్ క్లాస్, స్లీపర్ టికెట్లపై కిలోమీటర్ కు ఒక పైసా చొప్పున పెంచారు. ఈ మేరకు ఈ మార్పులు సోమవారం అర్ధరాత్రి నుంచే అమల్లోకి రానున్నాయని అన్ని జోన్ల మేనేజర్లకు రైల్వే బోర్డు సర్క్యూలర్ జారీ చేసింది. రిజర్వేషన్ చార్జ్, సూపర్ ఫాస్ట్ సర్ చార్జీల్లో మార్పు ఉండదని, ఇప్పటికే రిజర్వేషన్ చేసిన టికెట్లకు పెంచిన చార్జీలు అమలు కావని రైల్వే బోర్టు స్పష్టం చేసింది. కాగా రైల్వే టికెట్ ధరలను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధం అవుతున్నదన్న వార్తల నేపథ్యంలో కేంద్ర రైల్వే సహాయ మంత్రి వి.సోమన్న ఇటీవలే స్పందిస్తూ ప్రయాణికులపై ప్రభావం పడకుండా దశలవారీగా రైల్వే చార్జీలను పెంచుతామని చెప్పిన సంగతి తెలిసిందే.

## హైదరాబాద్ మెట్రోకు ప్రత్యేక గుర్తింపు పురస్కారం

హైదరాబాద్, జూన్ 30 (తీన్మార్ న్యూస్): జర్మనీలోని హాంబర్గ్‌లో ఇటీవల నిర్వహించిన ప్రతిష్టాత్మక యూఐటీపీ - 2025 అవార్డుల కార్యక్రమంలో ఆసియా పసిఫిక్ ప్రాంతానికిగాను ఎల్అండ్‌టీ మెట్రో రైల్ (హైదరాబాద్) లిమిటెడ్ కు ప్రత్యేక గుర్తింపు పురస్కారాన్ని దక్కించుకుంది. రోడ్స్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (ఆర్‌టీఏ) తోడ్పాటుతో, ఎల్అండ్‌టీ ఎంఆర్‌హెచ్ఎల్ "ఆప్టిమైజ్డ్ మెట్రో ఆపరేషన్ ప్లాన్స్ లీడింగ్ టు ఇన్‌క్రీజ్డ్ రెవెన్యూ పర్ ట్రెయిన్" ప్రాజెక్టుకు గాను తాజాగా ఈ పురస్కారం లభించింది. ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ నిర్వహించే ఈ పురస్కారాల కార్యక్రమం అర్బన్ మొబిలిటీని తీర్చిదిద్దుతున్న పరివర్తనాత్మకమైన ప్రాజెక్టులకు విశిష్ట గుర్తింపునిస్తోంది. గ్లోబల్ నెట్‌వర్క్ యూఐటీపీలో 100కు పైగా దేశాల నుంచి వివిధ ప్రజా రవాణా మాధ్యమాలకు చెందిన 1,900 ఆర్గనైజేషన్లకు సభ్యత్వం పొందాయి. 2025 ఎడిషన్‌లో ప్రపంచవ్యాప్తంగా అగ్రగామి ట్రాన్సిట్ ఆపరేటర్ల నుంచి 500 పైగా ఎంట్రీలు వచ్చాయి. ఆపరేషనల్ ఎక్సలెన్స్ కేటగిరీలో హైదరాబాద్ మెట్రో సంస్థ సమర్పించిన ఎంట్రీకి టాప్ 5 ఫైనలిస్టుల షార్ట్‌లిస్టులో చోటు దక్కింది. డేటా, సమర్థత ఆధారిత విధానాలకు గాను ప్రత్యేక గుర్తింపు లభించింది. ఈ మేరకు సోమవారం హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ ఎండీ, సీఈవో కేవీబీ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. యూఐటీపీ నుంచి ఈ ప్రతిష్టాత్మక పురస్కారం పొందడం మాకెంతో గర్వకారణమని తెలిపారు. సమర్థత, ప్రయాణికులకు ఉపయుక్తమైన సొల్యూషన్స్‌పై మాకున్న నిబద్ధతకు ఇది నిదర్శనంగా నిలుస్తోందన్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య మెట్రో ప్రాజెక్టు ఆపరేటరుగా, నిర్వహణ సామర్థ్యాలు, పురోగామి వ్యూహాలతో హైదరాబాద్ మెట్రోను ప్రపంచ వేదికపై నిలబెట్టడంపై మేమెంతో గర్విస్తున్నామని పేర్కొన్నారు. నిర్దిష్ట లక్ష్యాల సాధనకు అనుగుణంగా స్మార్ట్ రవాణా ప్రణాళికలను అమలు చేయడమనేది ఇటు వ్యవస్థపై అటు కార్యకలాపాలు నిర్వహిస్తున్న నగరంపై అర్థవంతమైన ప్రభావం చూపగలదనే మా నమ్మకాన్ని ఈ అవార్డు పునరుద్ఘాటిస్తుందని వెల్లడించారు.

